# చిల్లరదేవుళ్లూ — మనిషి

కవిత

బస్సు కదిలింది.

అమ్మయ్య అనుకున్నాను. ఔను. చింతపల్లిలో అరగంట పైగా ఆపేశాడు — లోడింగ్ కోసమని. పాసింజర్లు కూడా తక్కువమంది ఎక్కలేదు. కొండవాళ్ళు... కోయవాళ్ళు.., చెంచులు... బోయలు... ఎందరో ఎక్కారు. పసుపు... చింతపండు.. మిరపకాయలు... ఉల్లిపాయలు...ఎన్నో రకాల బుట్టలూ తట్టలూ బస్తాలూ ఎక్కించారు.

చింతపల్లి — మునుపటి కంటె — యిప్పుడు — నాగరికతకు దగ్గరయింది. సీలేరు ధర్మమా అని. రోడ్లు పడ్డాయి. మనుషుల.. సరకుల.. రవాణా సులభమూ, త్వరితమూ అయింది. కొండ — స్త్రీలు — నాగరికతకూ ఆటవికతకూ మధ్య — చిత్రంగా వున్నారు. జాకెట్టు... లంగా... లేదా పొట్టి చీరె. కాని — మెడలో పూసల దండలూ.. చేతులకి దంతం గాజులూ. ఆ గాజులు — మోచేతివరకూ. ఆమె నడుస్తూంటే వింత సంగీతం గజ్జెల చప్పుడు లాగ. మగవాళ్ళు మాత్రం చాలామంది గోచీలతోనే వున్నారు. లేదా — నడుముకి చిన్న గుడ్డ చుట్టుకున్నారు. మిగిలిన శరీరమంతా అనాచ్ఛాదితంగానే వదిలేస్తున్నారు. ఇప్పుడు వాళ్ళు బస్సెక్కుతున్నారు. కానీ — మునుపు సరుకులు మోసుకుంటూ ఎంతెంత దూరం కొండలలో కోనలలో నడిచేవారని?

బస్సు పరుగెడుతోంది.

అటూ యిటూ అడవి. అక్కడక్కడ కొంచెం పాకలు, రెల్లుగడ్డితోనో తాటాకుతోనో నేసినట్లు... పది, పదిహేనుకి మించకుండా. వాటినే కాబోలు గూడెం అంటారు.

"టికెట్"

ఒకవైపు కొండలు.. రెండోవేపు లోయలు... మధ్యగా రోడ్డు... ఎటు చూసినా పచ్చని చెట్లు... సాక్షాత్కరిస్తున్న ప్రకృతిని చూస్తూ పరవశించిపోతున్న నేను — కర్కశమయిన ఆ కంఠానికి ఉలిక్కిపడ్డాను. నిజానికి అది — బస్సుచేస్తున్న శబ్దంలాగే దుర్భరంగా ఉంది.

ఐతే — బస్సు శబ్దానికి అలవాటు పడిపోయాను. చాలాసేపటి నుంచి ప్రయాణం చేస్తూండడం వల్ల. అసలే ఘాట్‌రోడ్... ఆ పైన ప్రయివేట్ బస్... గేరులో నడుస్తూ చేసే శబ్దం సామాన్యమా! కాని... నాగరికుడైన కండక్టరు — అనాగరికులయిన కొండ వాళ్ళనెంత కర్కశంగా దండిస్తున్నాడు టికెట్ కోసం?

అడవి సౌందర్యాన్ని చూస్తున్న నాకు — కండక్టర్ కంఠం అపశ్రుతిలా వినిపిస్తూ — రసభంగం చేయడంతో... నా దృష్టి తప్పనిసరిగా యిటు — బస్సువేపు మరలింది.

"ఈకూన మాదే బాబు... ఏటి! ఇంత సిట్టికూనకీ సీటి రాసేత్తావా? నాయం కాదు బాబు..."

"ఈ బొట్టి... సిన్నది దొరా? మరో పాలిసూడు దొరా.. టిక్కెట్టు కొట్టేకు దొరా... కట్టుక్కోలేను...

"మూడు కూన్లకి ఓ సీటితో సరిపెట్టుక్కో దొరా..."

"సీల్లేదు... త్వరగా తియ్యండెహె?" కసురుతున్నాడు కండక్టరు. కోపగిస్తున్నాడు... డబ్బులు వసూలు చేస్తున్నాడు.

మెడలో — ఏదో వేరు... చుట్టుకున్న పాము పిల్లలా ఉంది. నడుముకి చిన్న గుడ్డ తప్ప ఏమీ లేదు వొంటిమీద. నుదిటి మీద మాత్రం నెలవంకలాంటి ఎర్రబొట్టు...

"ఏ వూరు!"

"సీలేర్దొర?" మొలలోంచి చిన్న సంచి తీశాడు.

అది గుడ్డసంచిలా కనిపించలేదు. పార్చ్‌మెంట్ పేపరుదిలా ఉంది. మడతలు విప్పాడు. దానిలో ఒకే ఒక్క నోటుంది. చిల్లరుంది. "తీసుకో బాబు..."

కండక్టరు — ఏ కళనున్నడో — కసురుకోకుండా — తీసి — లెక్కపెట్టాడు.

"మరో పదిహేను పైసలియ్యి"

"ఇంకానా! మరింక నా దగ్గర దుడ్డులేద్దొర"

"ఐతే — బస్సు దిగిపో.." కసిరాడు.

"బాబ్బాబు... కూనకి జబ్బు చేసిందని..."

"కథల్చెప్పకు... కాసు తియ్"

"లేదు సామీ" వినయంగా లేచి నిలుచున్నాడు.

"ఐతే దిగిపో... డ్రయివర్?... బస్సాపు" నటించాడు. బెదిరించాడు.

"బాబ్బాబు..." మనిషిని పట్టేసుకున్నాడు కోయదొర.

"దూరంగా వుండు... కంపూ నువ్వూను..."

నేను — బస్సులో రాసిన రాతలు చదువుతున్నాను.

'దేవుని భజింపుము'

'బస్ ఆగనిదే దిగరాదు'

'హరే రామ హరే రామ... హరే క్రిష్ణ... హరే క్రిష్ణ...'

'మానవసేవే మాధవ సేవ'

'బస్సులో పొగత్రాగరాదు'

"సుత్తికొట్టకు. డబ్బులిస్తావో.. బస్సు దిగిపోతావో త్వరగా చెప్పు" సినిమాలో విలన్‌లా గద్దిస్తున్నాడు కండక్టర్.

బస్సు కిటకిటలాడుతోంది, మనుషుల తోటే తట్టలతోటే. జనం — చోద్యం చూస్తున్నట్టుంది.

"ఆపు" కేకవేశాడు కండక్టర్, వేమూరి గగ్గయ్యలా...

"బాబూ.... రచ్చించు... నా బొట్టె జబ్బులో ఉంది. సూడాలనెళ్తున్నాను. నాకు సూపులు దక్కించు. నచ్చి — నీ కడుపున పుడతాను" దుఃఖం ఆపుకోలేకపోతున్నాడు.

"నువ్వు నా కడుపున పుట్టొద్దు. బస్సు దిగు. అదే చాలు... బలే బేరమే..." విసుక్కుంటున్నాడు కండక్టరు.

"నా కివ్వవలసిన చిల్లర లేదన్నావుగా... అది అతనికి బదలాయింపు చేసి..." చెప్పబోయాడు.

ఛరుర లేచాడు కండక్టరు "ఏం! అతన్ని బామ్మర్ది! పిచ్చి సలహాలివ్వకు...తెలివి తేటలు చూపెట్టావో ముందు నిన్ను దింపేగల్ను. గమ్మున కూర్చో...."

అతనిక నోరెత్తలేదు.. ఈ రూట్‌లో బస్ కండక్టరంటే బడాబాబు కాబోలనుకున్నాను.

"దొరా? నా బొట్టె... సావు బతుకుల్లో ఉంది. ఆస్పిటాల్లో ఉంది..." బతిమాలుతున్నాడు కోయవాడు.

"డబ్బులేని వాడు డుబ్బుకి కొరగాడు. పైసాలేకుండా నువ్వెళ్ళి చూసేదీ చేసేదీ ఏముందిలే! దిగు..."

బస్సాగడమేమిటి... అతన్ని జబ్బ పట్టుకుని బలవంతంగా కిందకి తోసేశాడు.

నా నోటి మాట నోటిలోనే ఉంది. బస్సు కదిలిపోయింది. కోయవాడి కేకలు... ఏడుపు లాంటి అరుపులు...


బస్సు వేగం పెంచుకుంది.

ఛీ నేనెందుకు మొహమాటపడ్డాను! ఆ పదిహేనుపైసలు నేనిస్తానని అనడానికెందుకు సంకోచించాను!

"పాపం... పదిహేను పైసలేగా... రానివ్వవలసింది" ఎవరో అన్నారు.

"అలాగే... అతన్ని రానిస్తే నేను యింటికి పోవాలి. దానధర్మాలకి యిది బస్సు. సత్రం కాదు" వ్యంగ్యంగా

**అందరితో పాటూ నేనూ దిగాను.... కొండలలో గుడి అంటే ఎలా ఉంటుందో అని ఆత్రంగా. చెట్టుకింద ఓ పెద్ద రాయి. దానికి పసుపూ కుంకుమా బొట్లు... పక్కనే కొందరు కొబ్బరికాయలు కొని దేవతకుకొడుతున్నారు...**




అన్నాడు కండక్టరు. నిజమే. కండక్టరు కష్టాలు కండక్టర్‌వి.

నేను — మళ్ళీ అటవీ సౌందర్యారాధనలో మునిగిపోయాను. బస్సు ఆగేసరికి చూశాను. రోడ్డు పక్క చిన్నపాక. అందులో ఓ కుంటివాడు "బాబూ? ధరమం..."

కండక్టరు — బస్‌లో ప్రయాణికులనుద్దేశించి అంటు అంటున్నాడు. "కుంటివాడు... ధర్మం చేయండి" వాడి

కొక్కు తనే తెచ్చి అందరిముందూ గలగలలాడించి — పబ్బులు వేశాక పట్టుకెళ్ళివాడికిచ్చేసి వచ్చి — "రైట్" చెప్పాడు.

"మా చేత వేయించడమేనా, నువ్వూ వేశావా ండక్టరూ!" నన్నారెవరో.

"హు... పావలా వేశాను..." గర్వంగా చెప్పాడు.

ఓ పావుగంట తిరిగేసరికి మళ్ళీ ఆగింది బస్సు

కండక్టరు కంఠం...

"కొండమ్మ గుడి... మంచి నిదర్శనం గల దేవత... మహత్యం కల దేవత...

అందరితో పాటూ నేనూ దిగాను. కొండలలో గుడి అంటే ఎలా ఉంటుందో అని ఆత్రంగా... చెట్టుకింద ఓ పెద్ద రాయి. దానికి పసుపూ కుంకుమా బొట్లు... పక్కనే కొబ్బరి కాయల దుకాణం. రాతి దేవత దగ్గర — కొబ్బరి చిప్పలు... అగరొత్తులు...పూలు.. కొందరు కొబ్బరి కాయలుకొని దేవతకు కొడుతున్నారు.

కండక్టరు — బ్యాగ్‌లోంచి రెండు రూపాయలు తీసి — వాడికిచ్చి కొబ్బరికాయ తీసుకుని కొట్టాడు. కండక్టరు కనుక కాబోలు అందరికీ కాయ మూడురూపాయలైతే అతనికి మాత్రం రెండే...

కొబ్బరికాయ కొట్టి... దేవత ఇచ్చిన చిప్పలో కొంత ముక్కలు చేసి పంచి — "రైట్" చెప్పాడు. బస్ ఖాళీగా ఉంది.

"కండక్టర్?" మెల్లగా పిలిచాను.

'మానవసేవే మాధవసేవ' నా ఎదురుగా నవ్వుతున్నాయి.

"మీ చిల్లర — తరువాతిస్తాను... సీలేరులో"

"అందుకు కాదు—"

"మరి!" అంటూ వచ్చి — నా ఎదురు సీటులో కూర్చున్నాడు.

"కొండమ్మ దేవతకు కొబ్బరి కాయ కొట్టావు కదూ!"

"ప్రసాదం మీకూ పెట్టానుగా! ప్రతి ట్రిప్పుకీ కొడతాను"

"మంచిదే. మరి — ఆ డబ్బు ఎక్కడిది!"

ఒక్కసారి నా వేపదోలా చేసి — నా వల్ల ప్రమాదం ఉండదనీ, నేను నిరపాయకరమైన వ్యక్తినే అనీ నిశ్చయించుకున్నాడు కాబోలు.. పళ్ళన్నీ పైకి పెట్టి నవ్వుతూ... "ఇంకెక్కడివి! దీనిలోవే... ఈ తల్లి మాలచ్మివే..." అన్నాడు.

"మరి కలక్షన్ తక్కువైతే — నిన్నింటికి పంపెయ్యరూ!"

"ఎందుకు తక్కువౌతుంది! మీ చిల్లర ఊరికే అట్టే పెట్టేసుకుంటానా!" నవ్వాడు... "లగేజికి టిక్కెట్టు కొట్టనివి... అన్నీ కలుస్తాయి"

"ఐతే...నీ పై ఆదాయం... చిల్లర ఆదాయం... బాగానే ఉంటాయన్నమాట?" అభినందిస్తున్నట్లన్నాను.

"ఆ?"

"మరి... ఇందాక.. కూతురు చావు బతుకుల్లో ఉందని గోలపెట్టాడే..."


"వాడా?"

"రోడ్డు పక్క కుంటివాడికి డబ్బులు దండిన ధర్మాత్ముడివి. కొండదేవతకి రెండ్రూపాయలిచ్చి కొబ్బరికాయ కొట్టిన పుణ్యాత్ముడివి.. మరి.. ఆ పేదవాడికి...నిర్భాగ్యుడికి.. కష్టంలో ఉన్నవాడికి... పదిహేను పైసలు వొదలలేకపోయావేం! ఆ బోర్డు చూడు... 'మానవ సేవే మాధవసేవ' భోళ్ళున నవ్వాడు కండక్టరు... "ఆ బోర్డు చూడండి..."

'బస్సులో పొగ త్రాగరాదు'. — కాని ఎందరు చుట్టలు సిగరెట్టూ కాలుస్తున్నారో?

"అదీకాక — మానవసేవ వల్ల ఉపయోగం ఉండదు. కొండమ్మకి కొబ్బరి కాయ కొడితే బస్సుకి యాక్సిడెంటు ▪కుండా కాపాడుతుంది. మనిషికి చేస్తే ఏముంది!"

అవాక్కయిపోయాను. నాకు కళ్ళు తిరిగాయి. ✤




"మీ నియోజక వర్గంలో మొత్తం ఏడుమంది ఎన్నికల్లో పోటీ చేస్తున్నారట. మీ అభిప్రాయం" అడిగాడు విలేఖరి రాఘవయ్యను.

"వాళ్ళదరిలో ఒక్కడే గెలుస్తాడు. అందుకు సంతోషంగా వుంది" చెప్పాడు రాఘవయ్య.

—బుషిశ్రీ (కమ్మపాలెం)

